# సునామీ

'అలలుగా దుఃఖం...
తొలినుంచీ ఆడదానికే
దుఃఖాన్ని పంచుకోమని నేనడగటంలేదు
నిన్నూ నామాదిరిగా దుఃఖించమనటంలేదు
దుఃఖ సంద్రంలోకి నెట్టద్దంటున్నాను
నీలా నన్నూ మనిషిలా చూడమంటున్నాను
నేనూ మనిషినని
నాకో మనసుంటుందని దానికి కొన్ని
స్పందనలుంటాయని గుర్తించమంటున్నాను'

రాసిందాన్ని ఒకసారి మళ్ళీ చదువుకుంది. కోడిగీతల్లా ఉన్న అక్షరాలను చూసి బాధగా నిట్టూర్చింది లక్ష్మి. తన చేతిరాత ఎంత బాగుండేది. చేతిరాత బాగుంటే బతుకురాత కూడా బాగుంటుందనేది తెలుగు మేడం. తన బతుకురాత ఎంత బాగుందో..? అనుకుంది దిగులుగా.

"మీ అమ్మను పిలుమ్మే... పొయ్యిమింద అన్నం పొంగతాండాది." అరిచింది అత్త సావిత్రమ్మ.

"అమా...అన్నం పొంగతాండాదంట. అవ్వ అరస్తాండాది" వచ్చి చెప్పింది పన్నెండేళ్ళ కూతురు సారిక.

ఉయలలో నిద్రపోతున్న ఐదు నెలల బాబును ఒకసారి చూసి, దీర్ఘంగా నిట్టూర్చి తను రాసిన కాగితాన్ని పేనాను అక్కడే ఉంచి వంట గదిలోకి వచ్చింది లక్ష్మి. అప్పటికే ఆమె అత్త అక్కడకొచ్చి, అన్నం పాత్ర మీద తట్టను తీసి పక్కన పెట్టి గరిటెతో కలబెడుతోంది.

"బాబుకు పాలిస్తాంటిత్తా... వాడు ఇప్పుడే నిద్రపోయినాడు" అని అత్తకు సంజాయిషీ చెప్పింది అడగకముందే లక్ష్మి

"పొద్దుకు ఎన్నిసార్లు ఇస్తావమ్మా పాలు. వోన్ని ఈన్నే పండేసుకోనుంటే ఏమి. వోడు ఏడ్చినప్పుడంతా ఆపక్కకు పోయి పాలిస్తాంటే అన్నం కూరెప్పుడయితాది. సందేళ అయితాండాదే" పొయ్యి దగ్గర నుంచి లేస్తూ కోడలిని మందలించింది సావిత్రమ్మ. అత్త ఖాళీ చేసిన స్థలంలో కూర్చుంది లక్ష్మి.

"అమా...మా...ఈగుండె కాయ కాల్చీమా"

అంటా వచ్చినాడు తొమ్మిదేండ్ల రెండో కొడుకు సురేష్.

మధ్యాహ్నం భోజనం సమయానికి మదనపల్లెనుంచి పెద్ద మరిది, తోడికోడలు వచ్చినారు. దాంతో లక్ష్మి పస్తుండాల్సి వచ్చింది. వాళ్ళకు కూడా అరకడుపుకే అయ్యింది ఉన్న భోజనం. అందరూ భోంచేస్తూనే లక్ష్మి భర్త క్రిష్ణ పేటకు పోయి బ్రాయిలర్ కోడిని పట్టుకొనొచ్చినాడు. అన్నాదమ్ములు పెరట్లో బండమీద కోడిని కోస్తాండారు. చిన్నబిడ్డతల్లి కావడం, మధ్యాహ్నం అభోజనంగా ఉండటంతో లక్ష్మికి కళ్ళు తిరుగుతున్నాయి. పొయ్యి పక్కనే ఉండే కుండలోనించి రెండు గ్లాసుల నీళ్ళు తాగింది.

"అమా...నాగ్గూడా గుండెకాయ కావాలమా" అంటా పెద్దకొడుకు రమేష్ కూడా వచ్చినాడు.

"అంతా నాకే కావాలమా..."అన్నాడు సురేష్.

"అతినాకొడకల్లారా...ఇంట్లో ఒగపని చెప్పినా చేయరు. ఇంతకు ముందే కదరా తిన్నేరు. కొంచేపుండండి. నిన్ను అంగడి దగ్గర ఉండమంటే బయట తిరగతాండావారా...మీ అక్క యాడికి పోయిండాది. తొట్లో నీళ్ళయిపోయినాయి. ఆయమ్మి ఒగనిమిసం గూడా ఇంటికాడ ఉండేటిగా లేదే" అంటా కుతకుతా ఉడుకుతున్న అన్నం పాత్రలోంచి రెండు మెతుకులు పట్టి చూసింది. రగులుతున్న కట్టెలు తీసి పక్కన పెట్టి వాటిమీద చెంబులోని నీళ్ళుకొన్ని చిలకరించింది.

"అమా...మా...నాకు గుండెకాయ కాల్చీమా" అన్నాడు సురేష్ మళ్ళీ.

"కొంచేపుండరా...రేయ్ రమేషూ... నువ్వు పోయి మీ అక్కను కేకెయ్, నీళ్ళు తెమ్మని చెప్పు సందేళయితే బోరింగ్ కాడ జనాలు ఎక్కువగా ఉంటారు" అంది కొడుకుతో లక్ష్మి.

లక్ష్మి ఐదడుగుల ఎత్తుంటుంది. చామనచాయ. మాసిన మాసిక చీర కట్టింది. పొద్దున లేసినప్పటి నుంచి తల దువ్వినట్టు లేదు. జుట్టంతా చిందరవందరగా ఉంది. నుదుటన మాత్రం పావలా బిళ్ళంత కుంకుమ బొట్టుంది. అది కూడా పొయ్యి దగ్గర కూర్చున్నందుకు చెమట చుక్కలతోపాటు ముక్కుమీదకు కారుతోంది. బక్కపలచగా, ఎండుచేపలా ఉంది.

నిప్పులను ఊదనబుర్రతో కొంచెం లోపలికి తోసి, మధ్యాహ్నం ఖాళీ అయిన అన్నం పాత్రను పొయ్యి గడ్డల ముందు ఉంచింది. పొయ్యిమీద పాత్రపైన మూకుడు పెట్టి మసిగుడ్డతో పట్టుకుని గంజి వార్చుతూ ఇంకా అక్కడే నిలబడుకోనున్న రమేష్‌తో "పోరా...ఒగసారి చెప్తే ఏదీ తలకెక్కదు. మీఅక్కను పిల్చుకోనిరాపో" అంటూ కసిరింది.

"మోవ్...నేనొచ్చేదాకా గుండెకాయ కాల్చద్దు" అంటా అక్కడినుంచి వెళ్ళిపోయాడు రమేష్.

కిందకు వడుగుతున్న గంజిలోంచి వస్తున్న వేడి పొగలను ఉఫ్‌ఉఫ్‌మని ఊదుతూ వంచింది. గంజి ఉన్న పాత్రను పక్కకు జరిపి సురేష్ చేతిలోని కోడి గుండెను సన్నటి కమ్మికి గుచ్చి నిప్పులపైన పెట్టి కాల్చింది. కొంచెం తుంచి పక్కన పెట్టి మిగిలింది కొడుక్కు ఇచ్చింది.

"నాకంతా కావాల..." అంటా రాగం ఎత్తుకున్నాడు వాడు.

"తినకపోతే ఉండు. మీ అన్న వచ్చినాడంటే మొత్తం తినేస్తాడు" అంటా కూరకు మసాలాలు సిద్ధం చేసుకోసాగింది.

"ఏఁమ్మా..." అంటా లోపలికి వచ్చిన కూతురు "గుండెకాయ" అంటా ఎత్తుకోబోయింది.

"మ్మేయ్ గమ్మునుండు. నువ్వేమన్నా నంగవా... పిల్లోల్లు తిన్నీ... యించేపు యాడికిపోయిన్నావుమే... తొట్లో నీళ్ళు లేవు. నీకు ఒంట్లో కొంచెం కూడా భయంలేదు. గాడిద మాదిరిగా ఉందావు. ఇంట్లో ఒగపనన్నా చేస్తాందావా? బిందెత్తుకోనిపో" అంటా కూతుర్ని అరిసింది లక్ష్మి.

తను తీసుకోకపోతే తినేస్తారనుకున్నాడేమో గుండె ముక్కను తీసుకోని ఊదుకుంటా తింటాండాడు సురేష్.

రమేష్ వచ్చి మిగిలిన ముక్కను తీసుకుని "నాక్కొంచెమేనామా" అన్నాడు.

"మో...అర్ధరూపాయికి తమల పాకులు ఇద్దువురా" అంటా వచ్చిందొకామె.

"ఆకులంట ఈపో రమేషూ" అంది లక్ష్మి.

పెద్ద పాత్రలో కోడిమాంసం తీసుకొచ్చి లక్ష్మి పక్కన పెట్టి "ఏం చేస్తాందావు" అన్నాడు క్రిష్ణ.

"పులుసు చేస్తాండాను"

"మిరేల పొడి ఏసి ఏంచగూడదా" అన్నాడు. మాట్లాడుతున్నపుడు క్రిష్ణ నోటిలోంచి సారాయి వాసన గుప్పుమంటా వస్తాంది.

"ఏంచితే అందరికీ సాలదుగదాబ్బా. నలుగురు పిల్లోల్లుండే పని. ఇంగా మీ తమ్ముడోల్లు వచ్చిందారు."

"పులుసే చేయ్యనీలేరా... వేనుకు పులుసంటేనే ఇష్టం" అంది సావిత్రమ్మ.

భార్యవైపు ఒగసారి ఉరిమిచూసి అక్కడినుంచి బయటికి వెళ్ళాడు క్రిష్ణ. ఇంతలో పక్కగదిలోనించి ఐదునెలల కొడుకు ఏడుపు వినిపించింది. తనతోపాటు ఉల్లిపాయలు, వెల్లుల్లి పాయలు తీసుకుని ఆగదిలోకి వెళ్ళింది లక్ష్మి.

ఇరవై బారల దూరంలో ఉండే మిద్దింటిలో మరిది, అతని భార్య, పిల్లలు ఉన్నారు.

'వచ్చి వంటలో సాయం చెయ్యచ్చు కదా. నేనొక్కదాన్నే చేయలేక అల్లాడతాండానే' అనుకొంటా కొడుకుని ఒళ్ళోకి తీసుకునింది లక్ష్మి.

రెండు భాగాలుగా ఉన్న కొట్టం అది. ఒకభాగం తలుపు మూసేసి ఉంది. కొట్టానికి జోద కప్పి చాలా ఏళ్ళయిన గుర్తుగా నల్లగా ఉంది. అక్కడక్కడా రంధ్రాలుపడి సూర్యుని వెలుతురు కిరణాల్లా లోపల పడుతోంది. తలుపు లోపల లక్ష్మి అత్తా మామా, మరిది అతని భార్యా పిల్లలు భోంచేయడానికి కూర్చుని ఉన్నారు.

"నీ మొగుడేడమ్మే..."

"ఆయన కోసమే చూస్తాండాను మామా... మ్మేయ్...నువ్వు పోయి దిగవీధిలో ఉంటాడు మీనాయన రమ్మని చెప్పు పో" కూతురికి చెప్పింది లక్ష్మి.

"నాకు ఆకలిగా ఉండాదిమా. తినేసి పోతా" అంది సారిక.

"ఈయమ్మికి ఎప్పుడూ తిండిమీదే ధ్యాస" సావిత్రమ్మ అంది.

"మద్యాన్నం తిన్నేవు కదామ్మే. ఇంతలోకే ఆకలా...ఏం పని చేసినావని. కడుపులో ఏమన్నా నక్కలు దూరినాయా... పిల్చుకోని రాపో తిందువు" గట్టిగా అరిచింది లక్ష్మి.

మూతి మాడ్చుకుంటా విసురుగా బయటకు పోయిన సారికను మళ్ళీ గట్టిగా కేకేసి పిల్చి "ఇందో... ఈన్ని ఎత్తుకోని పో. ఈళ్ళకు అన్నం పెట్టాల" అంది లక్ష్మి.

"అన్ని పనులు నాకే చెప్తారు. వోనికి చెప్తే ఏం" పెద్ద తమ్ముని చూపిస్తా అంటూ, చిన్నతమ్ముని తీసుకుని బయటకు వెళ్ళింది సారిక.

"వోన్ని భద్రంగా ఎత్తుకోమే. నువ్వు ముందే మదపు మనిషివి. ఎట్లంటే అట్ల ఎత్తుకోవద్దు" అన్నాడు లక్ష్మి మామ సిద్దయ్య.

"క్కో...ఈడు ఏడుస్తాండాడుకా... గుండెకాయ ఎయ్యి." అంది తోడి కోడలు తన నాలుగేండ్ల పెద్దకొడుకును పక్కన కూచ్చోపెట్టుకుని.

"మా అన్నేడమా... ఇంగా రాలేదు. ఆకలయితాండాది" అన్నాడు మరిది రఘు.

"మీ అన్నను నమ్ముకుంటే పొట్టపేగులుడకాల్సిందే. మీరు తినేయండి" అంటా ఒక్కొక్కరికి కంచంలో అన్నంపెట్టి కోడికూర వేసి ఇచ్చింది లక్ష్మి.

"ఈనికి గుండెకాయ ఈకా" అంది మళ్ళీ తోడికోడలు.

"లేదుమా...పిల్లోల్లు కాల్చుకోని తినేసినారు. మెత్త ముక్కలు పెట్టు".

"వోనికి కొంచెం మిగిలించింటేనేం. అంతా నీబిడ్డలకే పెట్టకపోతే" అంది సావిత్రమ్మ

"చూసినావు కదాత్తా.. వోళ్ళు ఎట్ల కొట్లాడు కొన్నేరో..."

"నాకు ఇంగా కొన్ని తునకలెయ్యి"

"అన్నం కూడా తినండిరా...వుత్త తునకలే తినద్దండి"

"మేము తునకలు తిని నెలయితాండాదిరా..." అన్నాడు సిద్దయ్య.

"మేము మాత్రం వారానికి ఒగసారి తేవాల్సిందే. లేకుంటే పిల్లోల్లు అన్నంతినరు. మద్దె మద్దెలో కోడిగుడ్లు తెస్తానే ఉంటాం." అన్నాడు రఘు.

"వారానికి ఒగసారి తినాలంటే మాకేడయితాది. పనులు బాగా జరగతాండాయారా."

"ఫర్వాలేదు నాయనా. టౌను కదా. ఏదో ఒగపని ఉంటాది. కష్టపడితే తినచ్చు. లేదంటే లేదు."

అందరూ మాటలు చెప్పుకుంటా తింటున్నారు. మధ్యాహ్నం తినక పోవడం... కోడికూర వాసన... పొగలు కక్కుతున్న వేడన్నం... లక్ష్మిలో ఆకలిని ఇంకా ఎక్కువ చేశాయి. తిందామంటే భర్త రాలేదు. ఒగసారి తలుపు తీసి వీధిలోకి పార చూసింది. ఎక్కడా భర్త జాడ కనపడలేదు. లోపలికి వచ్చి మళ్ళీ తలుపు మూసింది. సాయంకాలం కావస్తుండటంతో లోపలంతా చీకటిగా ఉంది. ఇంటిపైకప్పుకున్న రంధ్రాల నుంచి వస్తున్న వెలుతురు తక్కువగా ఉంది.

"కొంచెం అన్నం పెట్టుకా" అంది తోడి కోడలు.

"చాలా బాగుందిమా కూర" అన్నాడు మరిది.

"నీకిష్టమనే పులుసు చేసినాం. మీ అన్న ఏంచమన్నేడు. ఏంచలా" తోడికోడలుకు అన్నం పెట్టి కూరవేస్తూ అంది లక్ష్మి.

"నువ్వు చేసే కూరలు బాగుంటాయక్కా.. నేను చేసే కూరలు ఎప్పుడూ తప్పులు పడతా ఉంటాడు నీ మరిది."

"అన్నీ ఉండి చేస్తే ఎవురు చేసిన కూరయినా బాగానే ఉంటాది. మెరపకాయ ఉంటే, ఎర్రగడ్డ ఉండదు. ఎర్రగడ్డ ఉంటే మెరపకాయ ఉండదు. అట్లయితే ఎవురు చేసినా కూరలు బాగుండవులేమ్మే" అంది సావిత్రమ్మ.

"నువ్వు పెట్టుకోని తినుమ్మా" అన్నాడు మరిది లక్ష్మితో.

"మీ అన్న రానీలే రఘు"

"మీ ఒదిన వోడు తినకుండా తింటుందారా... అర్ధరాత్రయినా వోడు తిన్నేకనే తింటాది" అన్నాడు సిద్దయ్య.

"అందుకే ఎండగాలతాండాది. ఏళకు ఇంత తింటే గదా మనిసి ఆరోగ్యంగా ఉండేది" కోడలిని తప్పు పట్టింది సావిత్రమ్మ.

"ఇంగా ఏందిమ్మా నువ్వు సన్నబిడ్డ తల్లివి గదా. ఇప్పుడు కూడా మా అన్న కోసరం తినకుండా కాపెట్టుకోనుంటే ఎట్ల. నా పెండ్లాం ఉండాది చూడు. నేను తిన్నే తినకపోయినా దినానికి నాలుగు పూటలు ముక్కల్దాకా తింటాది" అన్నాడు రఘు.

"లేదులే... పాపం నీకోసరం కాసుకోనుంటాలే ఉండు. ఎవురికి ఆకలయితే వాళ్ళు తింటారు" అనింది తోడికోడలు.

తలుపు తోసుకుని లోపలికి వచ్చింది సారిక. ఆ అమ్మాయికన్నా ముందుగా మహేష్ ఏడుపు లోపలకు వచ్చింది.

"వస్తాండాడా మీనాయన" అడిగింది లక్ష్మి.

"రాలామ్మా... ఆన్నే ఉండాడు. నాకన్నం పెట్టుమా" అంటా తల్లి చేతికి ఇచ్చింది బాబును.

"ఈనికి ఆకలయిందేమో... కొంచేపుండు. మీచిన్నాయనోళ్ళకు ఏమన్నా కావాలంటే పెట్టు. మళ్ళ తిందువు"

"మాకేమీ వద్దులేమా... నువ్వు పెట్టుకోని తినుమ్మే" అన్నాడు రఘు.

"మీనాయన ఏం చేస్తాండాడు" అడిగాడు సిద్దయ్య.

"ఎంకటముని మామ, నాయన పులీమేకా ఆడతాండారు" అంటా గిన్నెలో అన్నం పెట్టుకుని కోడికూర వేసుకుని గబగబా ఒక ముక్క నోట్లో వేసుకుని "ఇస్..అబ్బా" అంటా ఆ ముక్కను మళ్ళీ చేతిలోకి తీసుకునింది.

"ఆత్రం పట్టిందానా... చల్లారినాక తిను" అన్నాడు సిద్దయ్య.

"ఎంచేపు తింటావురా రమేషూ... నువ్వు పొయ్యి మీనాయన్ను తాత పిలుస్తాండాడు రమ్మని చెప్పు" అంది లక్ష్మి పిల్లాడికి పాలిస్తూ.

రమేష్ కుడిచేతిని నాక్కుంటా వీధిలోకి పరిగెత్తాడు.

"అబ్బా... ఎందుకురా నాకొడకా కొరకతావు. గమ్మున తాగలేవా" అంటా మెల్లిగా

మహేష్ వీర్రమీద ఒక దెబ్బ వేసింది లక్ష్మి. 'నేను తింటే కదరా నీకు పాలుండేదానికి' అనుకుంది.

రెండు నిమిషాల్లో రమేష్ పరిగెత్తుకుంటా వచ్చి "అమ్మా...నువ్వు పోరా వస్తాను అన్నేడు నాయన" అన్నాడు గసపోసుకుంటా.

"ఈయనను దినమ్మూ కొత్త సుట్టాన్ని అడుక్కున్నెట్టు అడుక్కోవాలేమో తినేదానికి" లక్ష్మి కాస్త కోపంగా అంది.

మిగిలిన వారెవ్వరూ మాట్లాడకుండా మౌనంగా తిన్నారు.

"ఎంతసేపు తాగతావురా... మీ అవ్వ దగ్గరికిపో" అంటా అప్పుడే గిన్నెలో చేయి కడుక్కున్న అత్త చేతికి కొడుకును యిచ్చి "నేనుపోయి పిల్చుకోని వస్తానుత్తా. దినమ్మూ ఆయన చేత అన్నం తినిపించేది నాకు పెద్ద గండమయిపోతాండాది. చిన్న పిల్లోల్లన్నా మేలు"అంటా వీధిలోకి అడుగు పెట్టింది.

వడివడిగా నడుచుకుంటా దిగవీధిలోకి పోయింది.

పులీమేకా ఆడతాండే భర్తను చూశాలకు లక్ష్మిలో కోపం ఎక్కువయింది.

"ఏంబా... ఇంటికొచ్చి తినేసి పోయిండచ్చు కదా" అంది కాస్త కోపంగా.

"ఇయ్యేలకాడ ఏమన్నమమ్మా" అన్నాడు వెంకటముని నవ్వుతా. అతని మాటలతో పాటు సారాయి వాసన.

"కోడికూర చేసినాంనా. పేటకు పోయి పట్టకచ్చినాడు ఈయన... మా మరిది కూడా వచ్చినాడు. అందరూ తింటాండారు. ఎంచేపు ఈయన కోసరం కాపెట్టుకోనుండేది. పిల్లోల్లను రెండుతూర్లు అంపిచ్చినా రాలా చూడు ఇంటికి"

"ఏందే... నడీదిలో మద్దిస్తం పెట్టిండావు. పో నోర్మూసుకోని ఇంటికి" అన్నాడు క్రిష్ణ. అతని మాటలు ముద్దముద్దగా వస్తున్నాయి.

"తాగేదానికి ఏలాపాలా లే. రా..., తినేసి వచ్చి ఆడుకుందువు. మీనాయన పిలస్తాండాడు నిన్ను" అంటూ భర్త చేతిని పట్టుకుని లాగింది లక్ష్మి.

మరో చేత్తో విసురుగా భార్యను తోసి లేచి నిల్చున్నాడు. లక్ష్మి అతి కష్టంమీద కింద పడకుండా నిలదొక్కుకుంది.

"నాచెయ్యి పట్టుకునే హక్కు ఎవరిచ్చినారే నీకు అఁ..."

"సరేసరేలే రా..." అంది బాధగా లక్ష్మి.

భార్యను అనుసరించాడు క్రిష్ణ. దారి పొడవుకూ తిడుతూనే ఉన్నాడు. లక్ష్మి కళ్లలో నీళ్లు కారుతూనే ఉన్నాయి. 'ఎన్నాళ్ళీలా... ఇంక ఈయన మారడా. ఆ బిడ్డలన్నా లేకుండా ఉన్నింటే ఏబాయిలోనో దుంకి సచ్చింటే, పీడా పోయిండు. నాపాణానికి బిడ్డలు అడ్డం తగులు కున్నేరు' అనుకుంది.

లక్ష్మి నేరుగా ఇంటిలోకి పోయి గిన్నెలో అన్నం పెట్టి కోడికూర వేసింది. కానీ భర్త ఇంటిలోకి రాకుండా బయటే ఉన్నాడు.

"అన్నం తినుపోరా..."అంది సావిత్రమ్మ.

గడప బయట చూరు పట్టుకోని నిలబడుకోని "నువ్వు చేసినావా" అన్నాడు క్రిష్ణ.

"నాకేడ నాయనా అంత ఓపిక. ఆయమ్మే చేసింది" అంది సావిత్రమ్మ.

"ఎవరో చేస్తే నాకెందుకు... పోరా పక్కకు" అన్నాడు రెండు కాళ్ళను పట్టుకున్న రెండో కొడుకు సురేష్‌ను.

"ఎందుకురా వోన్ని అట్ల కసురుకుంటావు. ఈడు నీ పగ్గరికి ఎట్ల ఎగబడతాండాడో. ఉందరా మీనాయన అన్నం తిననీ. మళ్ల ఎత్తుకుంటాడు." అంది సావిత్రమ్మ.

తల్లి చేతుల్లోనించి తనవైపు ఎగబడుతూ బోసినవ్వులు చిందిస్తున్న చిన్నకొడుకు వైపు కోపంగా చూసినాడు క్రిష్ణ.

"రాబ్బా...తిండువు. సల్లగా పోతాండ్లా" అంది లక్ష్మి.

భార్యవైపు ఉరిమి చూసినాడు.

"పోయి తినుపోరా" అన్నాడు సిద్ధయ్య వక్కాకు నములుతూ.

రఘు, అతని భార్య మిద్దింటి దగ్గర ఉన్నారు.

"నాకు ఆకలిగా ఉంది రాబ్బా... మద్దేన్నం కూడా తినలా నేను" అంది లక్ష్మి.

మళ్ళీ భార్యవైపు ఉరిమి చూసినాడు క్రిష్ణ.

"రేయ్... క్రిష్ణా... ఈన్ని అట్ల ఎత్తుకోని ఈరా ఒగసారి. ఎగబడతాండాడు" అంది సావిత్రమ్మ.

"వోన్ని నేనెందుకు ఎత్తుకుంటాను... నాకేం సంబంధం..." అన్నాడు నేల చూపులు చూస్తా.

"నీగ్గాకుంటే ఎవురికి సంబంధం..." అంది లక్ష్మి భర్త వైపు అయోమయంగా చూస్తా. ఎప్పుడూ లేంది ఈపొద్దు ఎందుకు ఈయన ఇట్ల మాట్లాడతా ఉండాడు అనుకుంది.

"నన్నడిగితే నాకేం తెలుసు... నీకే తెలాల" అన్నాడు భార్యవైపు చూసి పళ్ళుకొరుకుతూ.

"నాయనా...వోళ్ళ భాస్కరగోడు నన్ను ఊరికేనే కొడతాండాడు" అంటా వచ్చినాడు రమేష్.

వాన్ని లాగి రెండు దెబ్బలేసి "పోరా దూరంగా... కొడకల్లారా" అన్నాడు క్రిష్ణ.

లక్ష్మి ముఖంలో నెత్తురుచుక్క లేకుండా పాలిపోయింది. భర్త ఎప్పుడూ అనని మాటలు ఎందుకు ఈ రోజు అంటున్నాడు అని చాలా బాధ పడింది. ఎంతగా బాధను ఆపుకుందామన్నా ఆగలేదు. కళ్ళనుంచి నీళ్లు బుగ్గల మీదుగా జారిపోతాండాయి.

అప్పటికి చీకటి పడింది. కరెంటు లేనట్టుగా ఉంది, ఇళ్ళల్లో దీపాలు వెలుగుతున్నాయి.

"మంచి మొగోనివేలే.. పోరా నోర్మూసుకోని లోపలికి. తినుపో" అంది సావిత్రమ్మ.

ఎంతకూ తనను తండ్రి ఎత్తుకోకపోవడంతో ఆమె చేతుల్లోని పిల్లాడు ఏడుపెత్తుకున్నాడు.

"...చూడు ఎంత నంగి ఏడుపులు ఏడస్తాందో..." అంటా గబుక్కున లోపలికి దూరి భార్య జుట్టు పట్టి వంచి వీపుమీద దెబీదెబీమని గుద్దతా "రంకుదానా... ఎంతబాగా ఏడస్తావే...వోడు నాకు పుట్టినోడు కాదే..." అన్నాడు క్రిష్ణ.

సావిత్రమ్మ నిశ్చేష్టురాలై చూస్తా ఉంది కొడుకువేపు. సిద్ధయ్య అక్కడి నుంచి మెల్లగా వెళ్ళిపోయాడు. పిల్లలు ముగ్గురూ ఆడుకోను పోయినట్టున్నారు. లక్ష్మి అక్కడే కూలబడి ఏడవ సాగింది.

"ఏమయ్యిందిరా నీకు" అంది సావిత్రమ్మ.

"నీకు తెలీదుమ్మా... బాగా చూడు వోన్ని. నా మాదిరిగా ఉండాడా... దాన్ని కోడి తునకలు ఏంచమంటే వోనికి ఇష్టమని పులుసు చేస్తాదా... దానికి నాకన్నా మిండగాడు ఎక్కువయినాడా" అంటా లక్ష్మిని ఎగిసి తన్నాడు. బాగా తాగేసి ఉండటంతో నిలదొక్కుకోలేక పడిపోయాడు. పద్దవాడు మళ్ళీ పైకి లేసి "...వోడు నాకు పుట్టినోడే కాదు. అంతా రగ్గాని పోలిక... పోయ్యే... నా ఇంట్లో ఉండద్దు... మీనాయనకు ఫోన్ చెయ్యి. తెల్లారేలకు నా కంటికి కనిపించకూడదు" అంటా భార్యను గొడ్డును బాదినట్టు బాదినాడు.

అంతలో కరెంటు వచ్చింది. ఇంట్లోని లైటు వెలిగింది. లక్ష్మి భర్తవైపు కోపంగా చూసింది.

"ఎందుకే అట్ల చూస్తావు... నాకెందుకే నువ్వు. వోన్ని తీసుకోని ఎళ్ళిపో... మీనాయన్ను రమ్మని చెప్పు. నీసామాన్లు తీసుకోని పోతాండు" అంటా లక్ష్మి చేతిని పట్టుకోని లాగి గడప బయట కుదేశాడు.

అంతవరకు అకలి నీరసంతో ఉన్న లక్ష్మి ఒక్క ఉదుటన పైకిలేసింది. ఊడిన జుట్టును ముడేసుకుని, పైట చెంగును నడుంవద్ద దోపుకుని, అత్త చేతుల్లో గుక్క పట్టి ఏడుస్తున్న పిల్లాడ్ని తీసుకుని పదిండ్ల అవతల ఉన్న నాగరాజ ఇంటికి తండ్రికి ఫోన్ చేయను పోయింది.

లక్ష్మి తెల్లారి లేస్తానే శేరు బియ్యం వేసి అన్నం చేసింది. కందిపప్పు నానేసి నాలుగు వంకాయలు, రెండు టమేటాలు కోసి పుల్లగూర చేసింది. పిల్లలందరికీ స్నానాలు చేపించింది. అందరికీ దగ్గరుండి కొసరి కొసరి వడ్డించింది.

"అమా అమా.. నువ్వు తాతోళ్ళ ఊరికి ఎళ్ళిపోతావంట కదా... మళ్ల ఎప్పుడూ రావంటనే" అంటా అడిగిన రెండో కొడుకును పట్టుకుని భోరున ఏడ్చింది లక్ష్మి. తల్లితో పాటు వాడు కూడా ఏడ్చాడు. సారిక, రమేష్ అప్పటికే బడికి వెళ్ళిపోయారు. తనను తాను సంభాళించుకుని అంగడిలోని జామూన్‌లు నాలుగు తీసి కొడుకు జేబులో వేసి పలక, బలపం చేతికి ఇచ్చి "బాగా చదువుకోవాల. లీవుల్లో మీరుగూడా తాతోళ్ళ ఊరికి రాండి" అంది.

"నేను ఇప్పుడే వస్తామా..."అన్నాడు సురేష్.

"ఇప్పుడు నేను పోలేదులే. బడికి పో" అంటా వాడిని బడికి అంపించి ఇంటికి వచ్చేప్పటికి లక్ష్మి నాన్న రామయ్య వచ్చినాడు. అప్పటికి తొమ్మిది గంటలు కావస్తోంది. లక్ష్మి అత్తా మామ, మరిది తోడి కోడలు అంతా అన్నం తినేసినారు. క్రిష్ణ మాత్రం ముసుగు తీకుండా పడుకోనుండాడు. వాళ్ళు వియ్యంకుడిని పలకరించారు. లక్ష్మి తండ్రితో ముభావంగా మాట్లాడింది. రామయ్య కడుక్కుని వచ్చి భోంచేశాక భర్తను లేపింది.

"బాగుండావా...క్రిష్ణా" అన్నాడు రామయ్య.

మామవైపు ఒకసారి చూసి, భార్యవైపు ఉరిమి చూసినాడు.

"చూసింది చాల్లే... మానాయన్ను రమ్మన్నేవు కదా. వచ్చినాడు. ఏమో మాట్లాడు" అంది లక్ష్మి.

పక్కమీద పడిపోయిండే లుంగీని తీసి కట్టుకుని మౌనంగా వీధిలోకెళ్ళాడు క్రిష్ణ.

భర్త అటు వెళ్తూనే రాత్రి జరిగిన విషయాలన్నీ చెప్పింది లక్ష్మి. చెప్తూనే భోరున ఏడ్చింది. ఏడుస్తూనే చెప్పింది.

"ఎందుకు ఏడుస్తావులేమ్మా... గమ్మునుండు. మేముండాము కదా. నువ్వు మాకేం భారం కాదులే" అంటూ కూతురిని ఓదార్చాడు రామయ్య.

ఇంతలో క్రిష్ణ వచ్చినాడు.

"ఏమప్పా...నన్ను రమ్మన్నేవంటనే" అన్నాడు రామయ్య అల్లుడితో.

"అది చెప్పలేదా" మాటలతో పాటు క్రిష్ణ నోటినుంచి సారాయి వాసన గుప్పున వచ్చింది.

"రమ్మని చెప్పమనింది నువ్వు కదా... నువ్వే చెప్పు"

పిల్లాడికి పాలిస్తా కూర్చొని భర్తనే చూస్తాంది లక్ష్మి. గొడవ పడతారని తెలిసే సావిత్రమ్మ, సిద్దయ్య మిద్దింటి దగ్గరే ఉండిపోయారు.

"నేను చెప్పేదేముండాది...నీ కూతురు తప్పుడుది. నాకొద్దు పిల్చుకోని పో" అన్నాడు క్రిష్ణ

"బుద్ధుండే మాట్లాడతాండావా... ఏమనుకోనుండావు నాబిడ్డంటే.. నిప్పు... మావంశంలోనే అట్లా తప్పుడు పనులు ఎవరూ చెయ్యరు" అన్నాడు కోపంగా రామయ్య. కోపంతో ఆయన పెదాలు అదురుతున్నాయి.

"నేనేమన్నా తప్పుడు కూతలు కూస్తాండాననుకున్నావా... ఊరికేనే ఏనాకొడుకయినా పెండ్లాం తప్పుడుది అని చెప్పుకుంటాడా?"

"నాబిడ్డ తప్పు చేసినప్పుడు నువ్వు చూసింటే ఎందుకొదిలేసినావు. అన్నే నరికేసిండేది. నేనేమనుకోనుండను కదా. తప్పు చేసినట్టు ఎవ్వరి దగ్గరన్నా చెప్పించు... నువ్వు కాదు... నేనే నరికేస్తా.. ఇట్లా తప్పుడు కూతలు ఇంగోసారి కూస్తే మర్యాదుండదు"

"దాని సంగతి... ఇప్పుడే చెప్పిస్తానుండు." అంటా గబగబా పక్కింటికి వెళ్ళినాడు.

"నిజంగా నాకేపాపం తెలీదు నాయనా... తప్పుడు మనిషి ఆయన. ఊర్లో ఎందరితో తిరగలేదు ఆయన. అంతగా తిరగతాన్నే నేను గమ్మునున్నే. ఒగసారి వేరే దానితో ఉన్నెప్పుడు చూసి నిలదీశాలకు నన్నే కొట్టినాడు. ఇప్పుడేమో నా మిందే నిందేస్తాండాడు" అంటా భోరున ఏడస్తా ఉంది లక్ష్మి. ఇంకా ఏదో చెప్తానే ఉంది. ఆమె ఏడుపు, మాటలు కలిసిపోయి మాటలు అర్థం కావడంలేదు.

పక్కింటి పెద్దామెను తీసుకుని వచ్చి "చెప్పుత్తా...నువ్వే చెప్పుత్తా... ఆ పొద్దు నాతో చెప్పినావే... ఆమాటలు చెప్పు" అన్నాడు క్రిష్ణ.

"చెప్పమ్మా... నాకూతురు తప్పు చేసేది నువ్వుగన కృద్దుగా చూసింటే నా బిడ్డను ఈన్నే నరికేస్తా" అన్నాడు రామయ్య. ఆవేశంతో మనిషంతా ఊగిపోతున్నాడు.

"నాకేం తెల్దు నాయనా... ముసిలిదాన్ని నామింద చెప్తాండాడు. నేనేంచెప్పలా నీకు" అందామె.

"అత్తా...నిజం చెప్పత్తా...ఆ పొద్దు నాతో ఏమని చెప్పినావు. వీడు మా రగ్గాని మాదిరి ఉండాడని చెప్పలా. నువ్వు చెప్పలా..." అన్నాడు ఆమె చేతిని పట్టుకుని ఊపతా క్రిష్ణ.

"నాకేం తెల్దు నాయనా... ఒగేళ చెప్పిన్నే తప్పేముండాది. అన్నదమ్ముల పోలికలు బిడ్డలకు రాకుండా ఉంటాయా. నీభార్య తప్పు చేసిందని నేనేమన్నా అన్నేనా. నువ్వేదో మొనుసులో పెట్టుకోని నన్ను ఇరికించద్దు." అంటా అక్కడినుంచి వెళ్ళిపోయిందామె.

"ఏమంటావయ్యా ఇప్పుడు పెద్దమనిషీ... ఇట్లా తప్పుడు కూతలు ఇంగోసారి కూయద్దు"

"నేనేం తప్పుడు కూతలు కూయలా. నిన్న గూడా కోడితునకలు ఏంచమంటే అది పులుసు చేసింది. ఇది నాకు వద్దు. పిల్చుకోని పో" అన్నాడు క్రిష్ణ.

రామయ్యకు కోపం ఎక్కువయిపోయింది. అల్లుణ్ని చూసి పల్లు పటపటా కొరికినాడు. "సరే అయితే, పిల్చుకోని పోతాండాను. ఇంగ ఎప్పుడే గానీ నా కూతురు కావాలని మళ్ళా నా ఇంటి గడప తొక్కగూడదు" అన్నాడు.

"నీ ఇంటి గడప తొక్కితే నీ ఎడంకాలి మెట్టుతో కొట్టు" అని అక్కడినుంచి వెళ్ళిపోయినాడు క్రిష్ణ.

ఏడస్తా నేలకు అతుక్కుపోయిండాది లక్ష్మి. ఆమెతో పాటు పిల్లాడు కూడా ఏడుస్తున్నాడు.

"ఎందుకమ్మా...ఏడుస్తావు. పోదాం పదా... నలగర్ని సాకి సంతరించినాం. నువ్వేం బరువు కాదు మాకు" అన్నాడు రామయ్య కూతురితో.

ఎప్పుడొచ్చారో ఏమో... జరిగిన గొడవంతా గోడపక్కన నిలబడుకోని సావిత్రమ్మ, సిద్దయ్య విన్నారు. విననట్టుగా మిద్దింటి దగ్గరకు వెళ్ళిపోయారు.

పెళ్ళప్పుడు నాన్న తీసిచ్చిన ట్రంకు పెట్టెలో తనవీ, పిల్లాడివి బట్టలు సర్దుకుంది. అప్పుడప్పుడు తన భావాలను రాసి పెట్టుకున్న నోటు పుస్తకాన్ని కూడా తీసుకునింది.

ఇంతలో ఊరికి పోవడానికి రఘు భార్యా బిడ్డలతో వచ్చి "పోయొస్తాంమా" అన్నాడు.

"సరేనాయనా... పేటకాడ ఆటో ఉంటే పంపు..." అంది లక్ష్మి.

"ఇప్పుడెందుకమ్మా ఆటో" అన్నాడు రఘు.

"నువ్వు రారా గమ్మునా" అంటా కొడుకు చేయి పట్టుకుని లాక్కెళ్ళాడు సిద్దయ్య. వారిని అనుసరించింది సావిత్రమ్మ కోడలి వైపు నిరసనగా చూస్తూ.

తనను ఏమాత్రం పట్టించుకోకుండా వెళుతున్న అత్తా మామలను చూసి లక్ష్మిలో దుఃఖం ఇంకా ఎక్కువయింది.

"లక్ష్మీ...నీకు ఫోన్ వచ్చింది" అంటా వచ్చింది పార్వతమ్మ.

బాబును ఎత్తుకుని ఆదరాబాదరా వీధిలోకి వచ్చింది లక్ష్మి. నడినెత్తిన సూర్యుడు నిప్పులు కుమ్మరిస్తున్నాడు. ఇంట్లోనించీ వీధిలోకి రావడంతో కండ్లు కాసేపు మసకబారాయి. గబగబా ఇంట్లోకి అడుగు పెడుతూ "ఎవరంటక్కా" అంది లక్ష్మి పార్వతమ్మతో.

"ఇంగెవరు...నీమొగుడు" అందామె.

వణుకుతున్న చేత్తో రిసీవర్‌ను పట్టుకుని "హలో" అంది.

"ఏమే...వస్తావా రావా..?"

"......"

"నిన్నే...ఏమే వస్తావా రావా...?"

"నామింద నింద మోపినాక ఎట్లొస్తాను నేను. ఎట్ల కాపరం చేస్తాను నీతో" అంది హీనస్వరంతో లక్ష్మి. సంకలోనించి పిల్లాడు ఫోన్ లాక్కోవడానికి ఎగబడుతున్నాడు.

"మొగుడన్నాక ఎన్నయినా అంటాడే... ఎందురు మొగుళ్ళు ఎన్ని మాటలు అనడం లేదు. నీమాదిరిగా ఒగ మాటంటానే ఆడోళ్ళంతా అలిగి ఎళ్ళిపోతారా"

"...." లక్ష్మి కళ్ళలో నీళ్ళు.

"పిల్లోల్లు నిన్ను కలవరిస్తా ఉండారు. మా అమ్మ అన్నం కూర చేయలేకుండా ఉండాది. నేను అన్నం తిని మూడు రోజులయితాండాది. ఊర్లో అందురూ నానారకాలుగా అనుకుంటా ఉండారు. ఈపొద్దు వచ్చెయ్యే"

"ఆ బుద్ధి ముందుండాల. నోటికి ఎంతొస్తే అంత మాటలు అనేసేదేనా...నేను రాను."

"మర్యాదగా చెప్తే ఇనవే. నువ్వు వస్తావా... నన్ను రమ్మంటావా? నేనొచ్చినానంటే ఈడ్చీడ్చి తన్నా. ఎవడు అడ్డమొస్తాడో చూస్తా. నాపెండ్లాం నా ఇష్టం. మొగుని దెగ్గిరికి రమ్మంటే రానంటావా..." ఇంకా ఏదేదో తిడుతూనే ఉన్నాడు క్రిష్ణ.

లక్ష్మి టకామని రిసీవర్‌ను పెట్టేసింది. అప్పటికే చెంపలమీద నుంచి కన్నీళ్ళు కారిపోతున్నాయి.

"ఏమంటాండాడు..." అడిగింది పార్వతమ్మ.

నోట్లో పైట చెంగు దురుక్కుని ఏడ్చుకుంటా గబగబా ఇంటికి వచ్చేసింది లక్ష్మి. పిల్లాన్ని పక్కన పడుకోబెట్టుకుని ఏడ్చుకుంటా ఉండిపోయింది. అలా ఎంతసేపున్నిందో ఏమో.

"లక్ష్మీ...లక్ష్మీ..." తల్లి కామాక్షమ్మ పిలుపుతో మగతగా కళ్ళు తెరిచి చూసింది. ఏడ్చీ ఏడ్చీ ముఖమంతా ఊదిపోయిండాది.

"నీమొగుడు ఫోన్ చేసినాడంట కదా" అందామె కూతురు పక్కన కూర్చుంటా.

ఔనన్నట్టుగా తల ఊపింది లక్ష్మి. పిల్లాడు అప్పటికే నిద్రపోయాడు.

"మామిడి చెట్లకు నీళ్ళు పోసేసి వచ్చేలకు ఈయరవ అయింది. మేమున్నింటేనా ఇడిపించేసిందుము తిక్క... ఏమనుకుంటాండాడు వోడు" అందామె.

లక్ష్మి మౌనంగా ఉండిపోయింది. ఆగిపోయిన కన్నీళ్ళు మళ్ళీ మొదలయ్యాయి.

కుండలో నీళ్ళు ముంచుకుని తాగి చెంబు పక్కన పెడుతూ "ఎందుకు ఏడుస్తావు... గమ్మునుండు నీకేం ఇబ్బంది రాకుండా మేము చూసుకుంటాం కదా. ఉన్నింది తలా కొంత తింటాం. లేకుంటే పస్తుంటాం. ఆ దరిద్రం కొంపలోకి మళ్ళా పోవద్దు" అన్నాడు లక్ష్మి తండ్రి రామయ్య.

"నన్ను రమ్మంటాండాడు. బిడ్డలు నన్ను కలవరిస్తా ఉండారంట. మా అత్త పనులు చేసుకోలేకుండా ఉండాదంట" అంది లక్ష్మి దిగులుగా.

"ఏం పోతావా...?"

"ఎట్లన్నమ్మా పొయ్యేది అంతనింద మోపినాంక. ఆయన్ను చూసినప్పుడంతా ఆ మాటలు గుర్తుకు వస్తాండ్లా"

"నువ్వేం పోవద్దులేమ్మా"

"ఇప్పటికే రెండుసార్లు ఈడికి తాగేసి వచ్చి గొడవ చేసినాడు. నేనీన్నే ఉంటే మీ పరువు పోతాండ్లా... బిడ్డలయితే కండ్లల్లో మెదులుతా ఉండారు. ఈ బతుకు బతికేదానికన్నా ఏబాయిలోనన్నా దుంకి సస్తేనన్నా ఒగసారితో పీడా పోతుంది" అంది లక్ష్మి ఏడుస్తూ.

"మ్మెవ్... ఏంటి మాటలయ్యి. రోజులు ఎప్పుడూ ఇట్లే ఉంటాయా... పిల్లోల్లు పెద్దోళ్ళు అయితే వాళ్ళే నీ దెగ్గిరికి వస్తార్లే. ఇప్పుడు మాత్రం రాకుండా ఉంటారా? లీవుల్లో రారా. వాళ్ళనింటి కాదులే అంతమంది బిడ్డల సాకేదానికి. నువ్వేం దిగులు పెట్టుకోవద్దు" అన్నాడు రామయ్య కూతురు పక్కన కూర్చుంటా.

"నీకేం భయంలేదులేక్కా ఇంగ ఐదేండ్లు అయిందంటే నాచదువు అయిపోతాది. ఏదో ఒగ ఉద్యోగం వస్తాది. నిన్ను బాగా చూసుకుంటాలే" అన్నాడు అంతవరకు చెర్లో క్రికెట్ ఆడి వచ్చిన ఇంటర్ చదువుతున్న తమ్ముడు భాస్కర్.

"ఇంటికాడ పుస్తకం ఎత్తుకోని చదవవు. చేనికాడ ఒగపని కూడా చేయవు. ఈడు సదివి, ఉజ్జోగం చేసి ఉద్ధరిస్తాడంట" అన్నాడు రామయ్య.

"నాయనో... నేను ఎంత బాగా చదువుతానో మీకేం తెలుసు. మా క్లాసులో నేనే ఫస్టు. చూస్తాండండి. డిగ్రీ ఐతానే ఎస్ఐ ఐపోతాను. అప్పుడుండాది చూడు మా బావ కతా... నాసామిరంగా... అట్లే రఫ్ ఆడించేస్తా" అన్నాడు అరచేతిని గాల్లో ఊపతా భాస్కర్.

"ఓనేలీ... ఏనాకొడుకు అడ్డం వస్తాడో చూస్తా... నా పెండ్లాం నా ఇష్టం" అంటా మాటలు వినిపించాయి వాళ్ళకు.

లక్ష్మి ఆ గొంతు వింటానే ఉలిక్కి పడింది. అది భర్త క్రిష్ణ గొంతు. వంట్లో వణుకు మొదలయింది. గబగబా లేచి కామాక్షమ్మ, రామయ్య ఇంటి ముందుకు వచ్చారు. వారి వెనకే వచ్చాడు భాస్కర్.

"ఏం మామా... నీ కూతుర్ని పంపతావా పంపవా" అడిగాడు క్రిష్ణ. ఫుల్లుగా తాగేసిందాడు. మాటలు తడబడతాండాయి. సరిగా నిలబడుకోలేకుండా ఉండాడు.

"నీకింతకాలం మర్యేద ఇచ్చినా. ఇట్ల చేసినావంటే బాగుండదు. నేను మంచికి మంచి చెడ్డకు చెడ్డ. ఏమనుకోనుండావో ఏమో నువ్వు" అన్నాడు రామయ్య.

"నోర్మూసుకుని పోతాండు. మా బిడ్డను పంపము. ఇంతవరకు చేసిన బాగోతం చాల్లే. మీ మాదిరిగా మేమేం తప్పుడోళ్లం కాదు. తప్పుడు పనులు చేయము, తప్పుడు మాటలు మాట్లాడితే గమ్మునుండము" అంది కామాక్షమ్మ గట్టిగా.

"అత్తో తో... మొగుడన్నాక ఏమన్నా చేస్తాడు. మామ నిన్ను ఏమన్లా ఎప్పుడూ... నేనూ అంతే. మర్యాదగా నా పెండ్లాన్ని నా యనకంటీ పంపించండి. లేకుంటే ఎట్ల పిల్చకపోవాలో నాకు బాగా తెలుసు".

అప్పటికే చుట్టు పక్కల ఇండ్లల్లో వాళ్ళంతా అక్కడ చేరారు.

"నీనుంచి ఏమయితాది... పో గమ్మున. నాకూతురు అక్కర లేదన్నోడు నోర్మూసుకోని మాటమింద ఉండాల. పాండి లోపలికి. ఎవరెట్ల పోతే మనకెందుకు" అంటా లోపలికి పోయాడు రామయ్య.

"గమ్మునుండప్పా...క్రిష్నా...ఈట్నుంచి పో" అన్నాడు పక్కింటాయన.

"ఎందుకు గమ్మునుండాల. అది నా పెండ్లాం కాదా...నేనంటే ఏమనుకున్నేరు. అల్లాటప్పా నాకొడుకనుకున్నేరా... సూపర్ స్టార్ క్రిష్ణ. నేను క్రిష్ణను. ఏమన్నా చేస్తా. ఏయ్ వా ఎనకంటీ వస్తావా, రావా..." అన్నాడు లక్ష్మితో.

లక్ష్మి గడప లోపల నిలబడుకోని ఏడుస్తా ఉంది. వీళ్ళ అరుపులకు పిల్లాడు నిద్ర లేచి ఏడుపు ఎత్తుకున్నాడు. కామాక్షమ్మ పోయి మనవడ్ని ఎత్తుకునింది.

"నేను రాను" అంది లక్ష్మి.

"ఎందుకు రావే. నీకేమన్నా తిండికి తక్కువ చేసినానా. గుడ్డకు తక్కువ చేసినానా. దానికేమన్నా తక్కువ చేసినానా?... దేనికన్నా తక్కువ చేసినానేమో మీరే దాన్నడగండి" అన్నాడు క్రిష్ణ

"ఔను.. పాపం నాకేం తక్కువ చేసినావు? ఏం తక్కువలేదు. నువ్వు తెచ్చి పెట్టిన లడ్డూ, పండ్లూ పలారాలు తిని ఎంత లావుండానో చూడు. పెండ్లయి పద్మాదేండ్లు అయితాంది. ఇంతవరకు ఒగచీర తీసిచ్చినావా. మా అమ్మోల్లు పండగలకు పెట్టినోటియే. బిడ్డలకు ఒగ జత గుడ్డలు కూడా లేవు మంచియి. సంపాదించిందంతా నీకు తాగను, తిరగను సరిపోలేదే. ఈడికొచ్చి మళ్ళా కూస్తాండావే" అంది లక్ష్మి కోపంగా.

"అట్లనగూడదమ్మా... మొగుడన్నాక సర్దుకోని పోవల్ల" అన్నారొకరు.

"ఎంతమంది మొగుల్లు ఎన్నిరకాలుగా ఇబ్బంది పెడతాండ్లా పెండ్లాలను. మొగోనికి ఏం. ఒగరు కాకుంటే ఇంగోరయితారు" అన్నారింకొకరు.

"అట్లా చెప్పండి దానికి. ఒసేయ్... నాకేమే... మొగోన్ని... నేను ఈలేస్తే చాలు. నూరు మందొస్తారు. పోదాంరా" అన్నాడు గడపకు దగ్గరగా వస్తూ క్రిష్ణ.

"నేను రాను.. నూరుమంది దెగ్గిరికే పో" అంది రెండడుగులు వెనక్కి వేసి లక్ష్మి.

"కడసారి అడగతాండా. వస్తావా రావా"

"నేను రాను" అంది స్థిరంగా.

"మాబిడ్డ రాదులే పోవయ్యా నువ్వు" అన్నారు రామయ్య, కామాక్షమ్మ.

"రావా... రావా... నువ్వు" అంటా పండ్లు పటపటా కొరకతా "అయితే నేను కట్టిండే తాళిబొట్టు నాకిచ్చేయ్" అంటా ఒక్కసారిగా లోపలికి దూరి లక్ష్మి మెడలోని మంగళసూత్రాన్ని పట్టుకున్నాడు.

లక్ష్మి గట్టిగా కేక వేసి మంగళసూత్రాన్ని పట్టుకుంది. బయట జనమంతా గట్టిగా కేకలు వేశారు. కామాక్షమ్మ చేతిలోని పిల్లాడు ఏడుపెత్తుకున్నాడు. రామయ్య ఒక్కుదుటున క్రిష్ణ పీక పట్టుకుని "మర్యాదగా వదులుతావా వదలవా" అన్నాడు కోపంగా.

మామవైపు ఉరిమి చూసినాడు క్రిష్ణ.

"రోషం ఉండే నాకొడుకయితే నా ఇంటి గడప తొక్కగూడదు. నీ ఇంటి గడప తొక్కితే ఎడంకాలి మెట్టుతో కొట్టు అన్నావే. ఇప్పుడెందుకొచ్చినావు లోపలికి. నడు ముందు బయటకు" అన్నాడు రామయ్య. బయటనుంచి ఇద్దరు ముగ్గురు వచ్చి క్రిష్ణను పట్టుకుని లాగుతూ "రాప్పా నువ్వు" అన్నారు. భార్య మెడలోని తాళిని వదినేసి వెనక్కు నడస్తా "మీ కత ఇట్ల కాదు" అంటా వీధిలోకొచ్చి చరచరా నడుచుకుంటా వెళ్ళిపోయినాడు.

చాలాసేపు లక్ష్మి వెళ్ళాలా వద్దా అనే విషయంపైన చర్చ జరిగింది.

గమ్మున వదిలేస్తే మళ్లీ మళ్లీ వచ్చి గొడవ చేస్తాంటాడని పోలీస్ కేసు పెట్టాలనుకున్నాడు రామయ్య. భార్యను, కూతుర్ని, పక్కింటి పార్వతమ్మ భర్తను పిల్చుకుని మండల కేంద్రానికి వెళ్ళాడు.

'అలలుగా దుఃఖం...
తొలినుంచీ ఆడదానికే
దుఃఖాన్ని పంచుకోమని నేనడగటంలేదు
నిన్నూ నామాదిరిగా దుఃఖించమనటంలేదు
దుఃఖ సంద్రంలోకి నెట్టద్దంటాను
నీలా నన్నూ మనిషిలా చూడమంటున్నాను
నేనూ మనిషినని
నాకో మనసుంటుందని
దానికి కొన్ని స్పందనలుంటాయని గుర్తించమంటున్నాను' తను అత్తగారింటిని వదిలి వచ్చేసే ముందురోజు రాసుకున్నదాన్ని చదువుకుంది లక్ష్మి.

'భర్తే కాదు. సాటిమనుషులు కూడా ఆడదాన్ని ఎప్పుడు మనిషిగా చూస్తాండారు?' అనుకుంది. ఊయలలో పడుకోనున్న కొడుకును చూసింది. లక్ష్మి ముఖంలో దిగులు. వీడు పుట్టే కదా నాకు ఇన్ని ఇబ్బందులు... వీడు పుట్టకుండా ఉన్నింటే... అంతకు ముందు మాత్రం ఆయన ఏంబాగ చూసుకున్నాడని. ఏపొద్దు సక్రమంగా ఉన్నాడని. ఇంగ ఈబతుకు ఇంతేనా... అనుకుంది.

"ఏంమ్మా లక్ష్మి నీకు ఎంతసేపూ ఏడ్సుకునే పనేనా. ఎందుకు ఆ ఎధవను తల్చుకుంటావు" అంది కామాక్షమ్మ.

"తల్చుకోకుండా ఎట్లుండమంటావమ్మా... పిల్లోల్లను చూడాలనుండాది. జనవరి ముందు లీవులు ఇచ్చిన్నేరు కదా. పిల్లోల్లు అంతా వస్తారేమో అనుకోనుంటి. సారిక ఒకటే వచ్చింది. నాకయితే కండ్లల్లో మెదలతా ఉండారు" అంది దిగులుగా.

"ఎందుకు గుర్తొస్తారమ్మా నీకు. అంతా అవతారంగా ఉండావే నువ్వు. వాళ్ళ మాటలే తల్చుకోవద్దు" అన్నాడు రామయ్య కోపంగా కూతురితో.

"ఎట్లుండమంటావు నాయనా. ఎంతగా వద్దనుకున్నే కనిపెంచిన బిడ్డలు కదా. సారిక అయితే నేనున్నెప్పుడు ఒగ పనికూడా చేసేది కాదు. నీళ్ళు కూడా పోసుకునేది కాదు. రోజూ

అరిసి అన్ని పనులూ చేపిస్తాంటి. ఈపొద్దో రేపో పెద్దమనిషి అయ్యేటిగా ఉండాది. నేను లేకుంటే ఇబ్బంది పడతాది కదా".

"వాళ్లవ్వ ఉంది గదా. నువ్వేం దిగులు పెట్టుకోవద్దులే"

"నాల్నాల్లు ముందు వచ్చిన్నింది గదా. అప్పుడు ఆయమ్మి ఏడ్చింది నాయనా. నన్ను రమ్మని చెప్పింది. ఆయన కూడా బాధపడతాండాడంట."

"పోతావా అయితే" అన్నాడు వ్యంగ్యంగా రామయ్య. మళ్లా ఆయనే "బయట అడ్డమైన 'గడ్డి' తింటా గుట్టుగా కాపరం చేసుకుంటాండే నీమింద నింద మోపతాడా. ఎట్ల పోవాలనిపిస్తాందిమ్మా నీకు" అన్నాడు.

"నలుగురు బిడ్డలు కదా నాయనా. ఈడగూడా జరుగుబాటు అంతగా లేదు. ఇంగ ఇట్ల చేయనంటా ఉండాడు. నా సుఖం కాదు గదా. బిడ్డల మొగం చూసయినా పోవాల. అంత సులభంగా పోనులే. స్టేషనుకు మా అత్తామామ, ఆయన వచ్చి ఇంగ ఇట్ల చేయనని రాసిస్తేనే పోతా. లేకుంటే పోను."

"ఆపొద్దు కేసు పెట్టినప్పుడుగన ఆయన దొరికింటే... మీ ఆయనకు వాళ్ళు కాంచేసిందురు పోలీసోళ్లు. తప్పించుకున్నేడు. పోలీస్ కేసు పెట్టకుండా ఉన్నింటే మళ్ళా వచ్చి గొడవ చేసిండు. ఈడికొస్తే పోలీసోళ్ళు పట్టుకుంటారని రాలా" అంది కామాక్షమ్మ.

"వాళ్ళ ఆడబిడ్డ మొగుడితో చెప్పంపినాడు కదామ్మా ఈడికొచ్చేదానికి మొగం చెల్లలేదని. మదనపల్లెకు పోతే ఆడికొచ్చి మాట్లాడతాడంటనే" అంది లక్ష్మి.

"ఏంది ఆడికి పోతే మాట్లాడేది. ఆమాట్లాడేదేదో ఈడికే వచ్చి మాట్లాడమను. మనం పొయ్యేదేం వద్దులే."

"ఆఁ... మనమెందుకు పోతాం. ఆయన ఐతే తాగినాడు ఆ మాటన్నేడనుకోమ్మా... మా అత్తామామా కూడా నేను నాయన ఎనకంటీ వచ్చేస్తాంటే 'ఉండమ్మా... పోవద్దు. తాగుబోతోని మాటలతో నీకేల. మేము లేమా. బిడ్డలు ఉండారు కదా. ఉండు' అని ఒగమాటనలేదు చూడమ్మా. వాళ్ళు గూడా గమ్మునయి పోయినారంటే చూసేవాళ్ళు ఏమనుకోవాల. మా ఆయన అనింది నిజమనుకోరా. మా తోడి కోడండ్లు ఇద్దరూ వాళ్ళ మొగుళ్ళను పిల్చుకోని టౌనుకు ఎల్లిపాయిరి ఈళ్లను పట్టించుకోకుండా. ఈళ్లు బాగా ముసిలోళ్లయిపోయినారు కదా. పేరుకు వారగా ఉండారు కానీ అన్నీ నేనే చేస్తాండాను. ఆ విశ్వాసం కూడా లేదు చూడమ్మా మా అత్తామామోళ్లకు" అంది లక్ష్మి. ఆమాటలంటున్నపుడు లక్ష్మి గొంతులో జీర.

"బాధపడద్దులే గమ్మునుండమ్మా. ఆ విశ్వాసం వాళ్లకుండాల. లేదు. దానికి మనమేం చేస్తాం."

"అందుకే నేను పోంది. నేను లేకుండా పోయాలకు ఇప్పుడు తెలస్తాంది వాళ్లకు వావిలువేందో. కొడుకు ఆపొద్దు అట్లా తప్పుడు కూతలు కూస్తా ఉన్నెప్పుడు అమ్మానాయన దండించిండచ్చు కదా, ఇట్లా మాటలు ఎట్లంటావురా గాడిద కొడకా అని. పద్దన్నే పెట్టెలో

అన్నీ పెట్టుకోని నాయన ఎనకంటీ ఎలబారినప్పుడు కూడా ఒగ మాట గూడా చెప్పలేదమ్మా ఉండమని. అందుకే నేను పోంది. మా ఆయనే కాదు. అత్తామామ కూడా రావాల. నేను చేసిన తప్పేందో చెప్పాల. నేనేం తప్పు చేయలేదని, ఇంగ బాగా చూసుకుంటామని పోలీసోళ్ల ముందర చెప్పి రాసిస్తే గాని నేను పోను. నాకు మాత్రం రోషం లేదా. వాళ్లు రాకుండా ఉంటే నేను పోనేపోను. ఈన్ని బాగా చదివించి ప్రయోజకున్ని చేస్తా. ఆయనకు కొడుకు చేతే బుద్ధి చెప్పిస్తా" అంది లక్ష్మి పైట చెంగుతో ముక్కు తుడుచుకుంటా.

ఎముకల గూడులా ఉన్న కూతురివేపు దిగులుగా చూసింది కామాక్షమ్మ.

"అంతేలేమ్మా... అంతేలే... యాడికి పోతారు రాకుండా. వాళ్లొచ్చినాంకనే పోదువులే" అన్నాడు రామయ్య.

"రామయ్యన్నో... సునామీలో సచ్చిపోయినోళ్లకోసరం అందరినీ దుడ్డు, గుడ్డలు అడగతాండాం. మీరేమన్నా ఈండి" అంటా నలుగురైదుమంది యువకులు లోపలికి వచ్చారు.

"మేమేమిస్తాం నాయనా..." అంటానే సొక్కాయి జేబులోనించి పదిరూపాయలు తీసి ఇచ్చినాడు రామయ్య.

"బిడ్డలు సచ్చిపోయిన పెద్దోళ్ళు... పెద్దోళ్లు సచ్చిపోయిన పిల్లోళ్లు... ఇండ్లు కొట్టుకోని పోయినోళ్లు... పొలాలు కొట్టుకోని పోయినోళ్లు... రకరకాలుగా బాధపడతాండారు. మనమిచ్చేది ఒగ రూపాయి కానీలేన్నా... సాయమన్నాక సాయమే కదా" అంటా అంతా అక్కడినుంచి వెళ్ళిపోయారు.

"ఈయనకేం తాగేసి యాన్నో ఒగ తావన పడిపోతాడు. పిల్లోళ్లతోనే నాయనా నాబాధంతా" అంటూండగానే లక్ష్మి కళ్లనుంచి నీళ్ళు జలజల జారాయి.

"అక్కా అక్కా.. సునామీ వచ్చిండే తావుయి టీవీలో ఏస్తే చూడాలంటివి కదాక్కా ఇప్పుడు ఏసినారు రాక్కా చూద్దువు" అంది పార్వతమ్మ కూతురు వచ్చి లక్ష్మితో.

"రామ్మా..." అంటా రామయ్య, కామాక్షమ్మ గబగబా లేచి పక్కింటికి వెళ్ళారు టివిలో సునామీ బీభత్సాన్ని చూడ్డానికి.

"ఆడేడో ఏందో అయ్యిందని, సాయం చేసేదానికి ఎగబడతాండారు. ఈడ మొగోళ్ళ దగ్గర తన్నులు తింటా... సావలేకుండా బతకలేకుండా వుండే ఆడోళ్ళను ఎవురూ పట్టించుకోరు" అంటూ పోతున్నారు వీధిలో ఎవరో...

సునామీ బీభత్సాన్ని తలుచుకుంటా అక్కడే కూర్చుంది ఏడుస్తూ లక్ష్మి. •

*తానా కథల పోటీ-2005లో సాధారణ ప్రచురణకు ఎంపిక*

**24-8-2005 నవ్య వీక్లీ**